జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 77 | శనివారం 9 ఆగస్టు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ఆ నంబరు అమిత్ షాదే!

కేంద్ర హోం మంత్రితో మాట్లాడిన మాటలూ వినేశారా?
నడ్డా, సంతోష్‌లతో జరిగిన సంభాషణలూ విన్నారు!
బండి సంజయ్ ముందు ముగ్గురి నంబర్లు ఉంచిన సిట్
అవాక్కయిన కేంద్ర మంత్రి.. 'సిట్‌తో తేలదు.. సీబీఐకి ఇస్తేనే కేసు కొలిక్కి'.. సంజయ్‌తో పోలీసు అధికారులు?

హైదరాబాద్, ఆగస్టు 8 (సందేశం టైమ్స్): ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. విచారణాధికారులు ఇచ్చిన ఫోన్ నంబర్లు చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌తో పలుమార్లు మాట్లాడారు. శుక్రవారం విచారణ సందర్భంగా ఈ ముగ్గురు అగ్రనేతల ఫోన్ నంబర్లను సిట్ అధికారులు సంజయ్ ముందుంచారు. ఆ నంబర్లు ఎవరివని అడగడంతో సంజయ్ అవాక్కయినట్లు తెలిసింది. కేంద్ర హోం మంత్రి, పార్టీ అగ్రనేతలతో తాను మాట్లాడిన మాటలు కూడా విన్నట్లు తెలియడంతో దిగ్భ్రాంతికి గురైనట్లు సమాచారం. అలాగే పార్టీకి విరాళాలు అందించినవారి నంబర్లు కూడా వెల్లడించిన సిట్ అధికారులు.. వారి ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు సంజయ్‌కు తెలిపారని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. ఫోన్ ట్యాపింగ్‌లో కీలకపాత్ర పోషించిన ప్రణీత్‌రావుకు ఒక కోడ్ ఇచ్చారని.. దాంతో ఆయన రోజూ సంజయ్‌తోపాటు వ్యక్తిగత సిబ్బంది ఫోన్‌లు ట్యాపింగ్ చేసి, ముఖ్యమైన సమాచారాన్ని నాటి ప్రభుత్వ పెద్దలకు తెలిపేవారని విచారణ సందర్భంగా సిట్ వెల్లడించినట్లు సమాచారం.

## ప్రతీ చుక్క వరద మూసీకి చేరాలి

చెరువులు, నాలాల్ని మూసీకి అనుసంధానించాలి
రాజధాని వరదకు మూసీ పునరుజ్జీవనమే పరిష్కారం
అప్పుడే నగరంలో కాలనీలన్నీ సురక్షితం
భారీ వర్షాలు పడినాతట్టుకునేలా ప్రణాళికలుండాలి
హైదరాబాద్ వర్షాలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 8(సందేశం టైమ్స్) : హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనమే మనకున్న చక్కటి పరిష్కార మార్గమని చెప్పారు. వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగించి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదికన శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల అవసరాలను అంచనా వేసుకొని అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుంచి శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి ముందురోజు రాత్రి నగరంలో కురిసిన వర్షం, తలెత్తిన ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. హైదరాబాద్‌లో ం రాత్రి ఏకంగా 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ట్రాఫిక్ స్తంభించింది. లోతట్టు ప్రాంతాలకు వరద ముంపు పరిస్థితి ఏర్పడింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. మూడు నాలుగు నెలల వర్షం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో ఇబ్బందులు వచ్చాయనే అంశం చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదని, ఒక్కోసారి కొన్నిచోట్ల 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కేవలం 4 గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, జీహెచ్ఎంసీ పరిధిలో 16 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎంత వర్షం పడినా నగరంలో ఎక్కడా నీరు నిలబడకుండా, వరద నీటితో ముంపునకు గురవకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉంటాయని చెప్పారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే నగరంలో ప్రస్తుత పరిస్థితి తలెత్తిందని అధికారులు అన్నారు.

## సింగూరు డ్యామ్ రక్షణకు చర్యలు తీసుకోండి



హైదరాబాద్, పుల్‌కల్, ఆగస్టు 8 (సందేశం టైమ్స్) : సింగూరు కట్ట రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'ప్రమాదంలో సింగూరు రిజర్వాయర్' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. సచివాలయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ తదితరులతో సమీక్షించారు. సింగూరు రిజర్వాయర్ మరమ్మతులకు ఎందుకు చర్యలు తీసుకోలేదని మంత్రి ఆరా తీయగా.. సంగారెడ్డి ఎస్‌ఈ, సీఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏ పని చేయాలన్నా ఈ రెండు పోస్టుల్లో అధికారులు అవసరమని అధికారులు వివరించినట్లు సమాచారం. ఎస్‌ఈ పదోన్నతుల ఫైల్ ఆమోదం పొందిందని, తక్షణమే పోస్టింగులపై నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అనంతరం ప్రాజెక్టును పరిశీలించి చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. మంత్రి ఆదేశాలతో ఈఎన్‌సీ మహ్మద్ అంజద్ హుస్సేన్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) టి.శ్రీనివాస్... చీఫ్ ఇంజనీర్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఈఈ (సెంట్రల్ డిజైన్స్) ఎంఎన్‌వీ చంద్రశేఖర్‌లతో సింగూరు ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం మీడియాతో ఈఎన్‌సీ అంజద్ హుస్సేన్ మాట్లాడుతూ తాత్కాలికంగా ఇసుక, కంకర బస్తాలతో దెబ్బతిన్న ఆనకట్ట ప్రాంతానికి మరమ్మతులు చేపట్టి పటిష్ఠం చేస్తామన్నారు. అయితే నీటి నిల్వలు గరిష్ఠంగా ఉంటే పనులు చేపట్టలేమని, నీటి నిల్వలు తగ్గాక పూర్తి స్థాయి పనులు చేపడతామని తెలిపారు. సింగూరు ప్రాజెక్టుకు ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదమేమీలేదన్నారు. ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో ఏమీ లేదని, చిన్నచిన్న లీకేజీలను సరిచేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టులో కొన్ని సాంకేతిక సమస్యలను సరి చేస్తామని తెలిపారు. ఆనకట్ట భద్రత కమిటీ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు.

## సంజయ్‌కు 48 గంటల గడువు!

ఫోన్ ట్యాపింగ్‌పై వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి..
క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు ఈడుస్తా: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 8 (సందేశం టైమ్స్) : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా పని చేయడమంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని అన్నారు. మీడియా హెడ్‌లైన్ల, చీప్ పబ్లిసిటీ కోసం సంజయ్ వీధి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని, లేకుంటే 48 గంటల్లోపు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు లీగల్ నోటీసు పంపిస్తున్నానని, 48 గంటలలో స్పందించకుంటే కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. కేంద్రం ఆమోదించక ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సంబరాలు ఎందుకు చేసుకుందో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పేరుతో చేస్తున్న కాలయాపనను పక్కనబెట్టి కామారెడ్డి డిక్లరేషన్‌లోని ఇతర హామీలను రాష్ట్ర ప్రభుత్వంతో అమలు చేయించాలన్నారు.

## ఆదివాసీల మీద కేంద్రం దాడి: మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (సందేశం టైమ్స్) : ఆదివాసీ, గిరిజనుల మీద కేంద్ర ప్రభుత్వం రకరకాల రూపాల్లో దాడులు చేస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం అడవి బిడ్డల హక్కులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో ఆద్యకళ మ్యూజియం వారి ఆధ్వర్యంలో 'ఆదివాసీ ఉరుములు – మెరుపులు' పేరుతో నిర్వహించిన మూలవాసీల కాంతి దీపాల ప్రదర్శనను సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజన, బహుజన శ్రామికుల కళా సంపదను భవిష్యత్తు తరాలకు అందించేందుకు కార్యక్రమ నిర్వాహకుడు ప్రొ. జయధీర్ తిరుమల రావు చేస్తున్న కృషి అసాధారణమైనదంటూ కొనియాడారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో ఆద్యకళ ప్రదర్శన ఏర్పాటుకు తామంతా అండగా నిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రజా గాయని విమలక్క, జయరాజ్, సామాజిక కార్యకర్తలు పృ?థ్వీరాజ్, అపర్ణ తోట, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పసునూరి రవీందర్‌తో పాటు వివిధ కళా రూపాలకు చెందిన సుమారు 80 మంది కళాకారులు పాల్గొన్నారు.

## పేదోడి కళ్లల్లో ఆనందం చూడాలి:పొంగులేటి




హనుమకొండ టౌన్, ఆగస్టు8(సందేశం టైమ్స్): పేదోడి కళ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం గత ప్రభుత్వంలో ప్రజాధనాన్ని ఖర్చు చేసి పేదల కల, ఆశలను నెరవేర్చలేదని విమర్శించారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే లక్ష్యంతో పభ్రుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 లక్షల పాత కార్డులు ఉండగా, ఆరు లక్షల కొత్తగా రేషన్ కార్డులు అందించామన్నారు. శ్రావణ శుక్రవారం రోజు 592 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

# డాక్టర్ల సమస్యలపై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు...





సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ రిపోర్టర్ ( ఆగస్టు 08) : తెలంగాణ వైద్య విధాన పరిషత్ ను డైరెక్టర్ సెకండరీ హెల్త్ గా త్వరలో అప్ గ్రేడ్ చేస్తాం :రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా .అసోసియేట్ ప్రొఫెసర్స్ నుండి ప్రొఫెసర్స్ గా పదోన్నతులు కల్పించినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహా గారికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ల సంఘం ప్రతినిధులు .తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో 1690 డాక్టర్ పోస్టుల భర్తీ కీ సానుకూలంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా స్పందించారు .డాక్టర్ల పోస్టుల భర్తీకీ తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి దామోదర్ ఆదేశం.డాక్టర్ల ఉద్యోగాల భర్తీలో వయోపరిమితి పెంపు పై నిబంధనలు రూపొందించటానికి కమిటీ నీ నియమిస్తాం. మంత్రి దామోదర్ రాజనర్సింహా . TVVP లో క్యాడర్ స్ట్రెంత్ పెంపు పై కమిషనర్ డా . అజయ్ కుమార్ తో చర్చించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా .TGGDA డాక్టర్ల సంఘం ప్రతినిధులతో సంగారెడ్డి లోని తన నివాసం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమావేశం . డాక్టర్ల సమస్యల పై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి పై మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు .ఈ సమావేశం లో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు డా . నరహరి , సెక్రెటరి జనరల్ డా . లాలు ప్రసాద్ , డా . రాహుఫ్ , డా . వినయ్ కుమార్ , డా . గోపాల్ , డా . క్రాంతి , డా . అశోక్ , డా . రామ్ సింగ్ లు పాల్గొన్నారు .

# నూతనంగా ఎన్నుకోబడిన నియామకం పత్రాలను అందజేత

## నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 8ఆగస్టు: సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ ప్రాంతీయ కార్యాలయం లో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జాతీయ చైర్మన్ మహతాబ్ రాయ్,ఇండియా ఇన్చార్జి, రాష్ట్ర అధ్యక్షులు బి సర్వేందర్,రాష్ట్ర చైర్మన్ రహీం వారి ఆదేశానుసారంగా శుక్రవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన నియామకం పత్రాలను ఐడి కార్డ్స్ లను పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రహీమ్ చేతుల మీదుగా నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సంగారెడ్డి జిల్లా చైర్మన్ సిహెచ్ రాజ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మైనుద్దీన్ ఖురేషి, నిజాంపేట్ మండల ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ చైర్ పర్సన్ నాయికోటి సుశీల లకు నియామకం పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ బాధ్యులు నవీన్ కుమార్, నాగల్ గిద్ద మండల అధ్యక్షులు వినోద్ కుమార్ నిజాంపేట్ మండల బాధ్యులు దుర్గయ్య, న్యాల్ కల్ మండల్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ ప్రాజెక్టుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలి



**నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**డ్యామ్ సెఫ్టీ అధికారుల చెప్పిన పట్టించుకోరా**

**ప్రమాదానికి బాధ్యత ఎవరు వహిస్తారు**

**సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**సింగూర్ ప్రాజెక్టు ను పరిశీలన చేసిన సిపిఎం బృందం**

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 8ఆగస్టు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో గల సింగూర్ ప్రాజెక్టుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. నేడు సిపిఎం ఆధ్వర్యంలో సింగూర్ ప్రాజెక్టు పరిశీలన చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. 1974 నిర్మించిన సింగూర్ ప్రాజెక్టు ఉమ్మడి మెదక్, నిజాం బద్, జిల్లా తో పాటు హైదరాబాద్ కు త్రాగు నీరు అందిస్తున్న దన్నారు. త్రాగు సాగు నీరు ఇస్తున్న సింగూర్ ప్రాజెక్టుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని లేకుంటే, ప్రాజెక్టుకు ముంపు వాటిల్లే అవకాశం ఉన్నదని అన్నారు. ప్రస్తుతం నీటి మట్టం పెరిగితే గండి పడే అవకాశం ఉన్నదని నిపుణులు చెపుతున్నారు. తక్షణమే ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ చర్యలు తిసుకొని మరమ్మతులు చెపటాలని అన్నారు. లేకుంటే ప్రాజెక్టు క్రింద ఆస్తి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉన్నదని అన్నారు. ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. సాయిలు, యం నర్సింలు, అందోల్ ఏరియా కార్యదర్శి విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జయరెడ్డి - గుణ చైతన్య రెడ్డి గార్లను ఆశీర్వదించిన మంత్రి డా. వివేక్ వెంకటస్వామి





సందేశం టైమ్స్ టౌన్ రిపోర్టర్ (ఆగస్టు 08): సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నిర్మల గార్ల కుమార్తె జయరెడ్డి మరియు గుణ చైతన్య రెడ్డి ల వివాహం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించబడింది. ఈ రోజు నూతన వధూవరులను కలిసి, వారికి ఆశీర్వాదాలు అందజేశారు తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రివర్యులు డా. వివేక్ వెంకటస్వామి

వేడుకలో పలువురు ప్రముఖ రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు, అభిమానం గలవారు పాల్గొన్నారు.

# ఆమరణ నిరాహార దీక్ష



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 8ఆగస్టు మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల్ కేంద్రం లో ఐబి చౌరస్తా వద్ద అల్లదుర్గం మండలంలోని బీజేపీ పార్టీ నాయకులు మాట్లాడు తు అల్లదుర్గం, టేక్మాల్, రేగోడ్, మండలాలను చార్మినార్ జోన్ లో కలుపుతాం. అని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, మరియు అల్లదుర్గం మండలంలో ఏర్పాటు చేస్తాం అన్నా,డిగ్రీ కళాశాల హామీని వెంటనే నెరవేర్చాలి అని,డిమాండ్ చేస్తూ నీరసనను వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాల బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# టీవీవీపీలో 1,690 పోస్టుల భర్తీ:దామోదర



హైదరాబాద్, ఆగస్టు 8 సందేశం టైమ్స్ టౌన్ రిపోర్టర్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)లో 1,690 డాక్టర్ పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఆయన నివాసంలో డాక్టర్ల సంఘాలతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీవీవీపీని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా త్వరలో అప్‌గ్రేడ్ చేస్తామన్నారు.అందుకనుగుణంగా డాక్టర్ల పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. టీవీవీపీలో క్యాడర్ స్ట్రెంత్ పెంపుపై కమిషనర్ డా.అజయ్ కుమార్‌తో మంత్రి చర్చించారు. అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించినందుకు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

# సంపాదకీయం

## ఆటలో గెలవాలంటే ఆడితీరాలి

ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలలో పాల్గొనడమనేది పౌరుల హక్కే కాదు, బాధ్యత కూడా. ప్రజలు ఆ హక్కును సద్వినియోగపరిచి, తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చేలా చూడడమనేది రాజకీయ పార్టీల, ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీల విద్యుక్త ధర్మం. అయినా కొన్ని రాజకీయ పార్టీలు లేదా ప్రజా వర్గాలు అప్పుడప్పుడూ ఎన్నికలలో పాల్గొనేందుకు నిరాకరించడం, ఆ ప్రజాస్వామిక ప్రక్రియను బహిష్కరించడం జరుగుతోంది. తద్వారా, ఎన్నికలలో పాల్గొనడం కంటే పాల్గొనకపోవడం ద్వారా ప్రభుత్వానికి, సమాజానికి తమ వైఖరి ఏమిటో స్పష్టాతి స్పష్టంగా చెప్పడమవుతుందని పార్టీలు లేదా ప్రజా వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలు లేదా ప్రజావర్గాలు ఎన్నికలను బహిష్కరించడమనే ఎత్తుగడ పాత, కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పునరావృతమవుతున్న లక్షణంగా ఉన్నది. అయితే చరిత్ర ఈ పరిణామం గురించి ఒక సత్యాన్ని చెప్పుతోంది: ఎన్నికల బహిష్కరణలు అరుదుగా విజయవంతమయ్యాయి. అవి చాలావరకు విఫలమయ్యాయని, ప్రతిపక్షాలను బలహీనపరిచాయని, అధికారంలో ఉన్న పార్టీలు లేదా నాయకులకే మరింత అనుకూల పరిస్థితులు సృష్టించాయని కూడా చరిత్ర స్పష్టం చేసింది. ఈ సంవత్సరాంతంలో బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను బహిష్కరించాలని ప్రతిపక్షాలు గట్టిగా పిలుపునిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ %-%సర్) పట్ల సందేహాలు, సంకోచాలతో విపక్షాలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఓటర్ల పేర్లను భారీ ఎత్తున జాబితా నుంచి తొలగించే లక్ష్యంతోనే 'సర్'ను చేపట్టారని, దీనివల్ల పేదలు, మైనారిటీలు, వలసపోయినవారు తీవ్రంగా నష్టపోనున్నారని 'సర్' విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో సర్ నిష్పాక్షికతను ప్రజలు విశ్వసించలేకపోతున్నారు.ఎన్నికల సంఘం పట్ల బిహార్ ప్రజల్లో అపనమ్మకం నెలకొన్నది. ఓటర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం తక్షణమే ఎటువంటి సందేహాలకు తావివ్వని రీతిలో సమాధానాలు ఇవ్వవలసిన అవసరమున్నది. అయితే ఇదే సమయంలో సర్ పట్ల ఆక్షేపణతో ఎన్నికలను బహిష్కరించడం ఎంతవరకు సబబు అనే విషయాన్ని నిశితంగా పరీక్షించవలసిన అవసరమున్నది. ఎన్నికల బహిష్కరణ విషయమై చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని దక్షిణాసియా అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) 2014లో పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించింది. అధికారంలో ఉన్న అవామీలీగ్ రాజీనామా చేసి, ఎన్నికల నిర్వహణకు ఒక తటస్థ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని బీఎన్‌పీ డిమాండ్ చేసింది. అవామీలీగ్ నిష్పాక్షికత పట్ల బీఎన్‌పీ అనుమానాలు నిరాధారమైనవి కావు. అయితే బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించడం ద్వారా అధికార పార్టీకి చెప్పుకోదగ్గ పోటీ లేకుండా చేసింది. ఫలితంగా 153 నియోజకవర్గాలలో అవామీలీగ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల అనంతరం నేను ఢాకాకు వెళ్లాను. బీఎన్‌పీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే తప్పకుండా గెలిచేదని చాలా మంది నాకు స్పష్టంగా చెప్పారు అధికార అవామీలీగ్‌కు విజయాన్ని బీఎన్‌పీ స్వయంగా సమకూర్చిందని వారు అభిప్రాయపడ్డారు. భారత్‌లో కూడా ఎన్నికల బహిష్కరణ జరిగింది. పంజాబ్‌లో 1992 అసెంబ్లీ ఎన్నికలు ఇందుకొక ఉదాహరణ. శిరోమణి అకాలీదళ్ ఆ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించింది. ఫలితంగా ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదయింది. కొన్ని జిల్లాల్లో కేవలం 13 శాతం ఓటర్లు మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. అకాలీదళ్ బాయ్‌కాట్ కాంగ్రెస్ పార్టీకి సులభ విజయాన్ని సమకూర్చింది. పోటీ రహితంగా ఎన్నికలు జరగడం, శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో పంజాబ్‌లో ప్రజాస్వామ్యం సార్థకత కోల్పోయింది. ఇంకా పలు బహిష్కరణల ఉదంతాలు ఉన్నాయి. అయితే వాటిలో చాలా భాగం ప్రధానస్రవంతిలో లేని వేర్పాటువాద పార్టీలు ఇచ్చినవే. జమ్మూ%-%కశ్మీర్ వేర్పాటువాద గ్రూపులు మొదటి నుంచీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూనే ఉన్నాయి.ఎన్నికలలో తాము పాల్గొనడం జరిగితే కశ్మీర్‌లో భారత పరిపాలనకు న్యాయసమ్మతి కల్పించడమే అవుతుందని వేర్పాటువాదులు తమ నిర్ణయాన్ని సమర్థించుకునేవారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో కూడా ఎన్నికల బహిష్కరణ పిలుపులు విజయవంతమవలేదు. వెనిజులా ఇందుకొక ఉదాహరణ. 2005లో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయి. ఫలితంగా జాతీయ అసెంబ్లీలో ప్రతి సీటునూ పాలక కూటమి గెలుచుకున్నది. 2018లో పాక్షికంగా బహిష్కరించాయి. నికోలస్ మదురో మళ్లీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు ఈ బహిష్కరణ తోడ్పడింది. 2020లో కూడా ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనకపోవడంతో 31 శాతం ఓటర్లే పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ తక్కువ శాతం పోలింగ్‌తో అధికార పార్టీకి భారీ మెజారిటీ లభించింది. జింబాబ్వేలో మోర్గాన్ స్వాన్‌గిరాయి 2008 అధ్యక్ష ఎన్నికల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో రాబర్ట్ ముగాబే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల బహిష్కరణ వల్ల గానీ లేదా ఓటర్లు చాలా తక్కువగా పోలింగ్‌లో పాల్గొన్న కారణాన గానీ సంబంధిత ఎన్నికను రద్దు చేసే సౌలభ్యాన్ని భారత రాజ్యాంగం కల్పించలేదు. షెడ్యూలు ప్రకారం ఎన్నికల సంఘం విధిగా ఎన్నికలు నిర్వహించి, పోలయిన ఓట్ల ప్రాతిపదికన విజేతలు ఎవరో ప్రకటిస్తుంది. కనుక ఎన్నికల బహిష్కరణ పిలుపు ఎన్నికల ప్రక్రియను నిరోధించలేదు, నిరోధించజాలదు. పార్టీలు లేదా అభ్యర్థులు పోటీనుంచి వైదొలిగిన పక్షంలో అది బరిలో ఉన్న అభ్యర్థికి సులభ విజయం సమకూర్చడానికి మాత్రమే దోహదం చేస్తుంది.

# వెల్డింగ్ షాప్‌లో భారీ విస్ఫోటం



### విశాఖలో ముగ్గురి దుర్మరణం
### తునాతునకలైన మరో రెండు దుకాణాలు
### ముగ్గురికి తీవ్రగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
### సముద్రంలో దొరికిన వస్తువు కట్ చేస్తుండగా పేలుడు జరిగినట్లు అనుమానాలు

విశాఖపట్నం,ఆగస్టు 8(సందేశం టైమ్స్):విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఒక వెల్డింగ్ దుకాణంలో సాయంత్రం భారీపేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. దుకాణంలో పనిచేస్తున్న మరో ఇద్దరితోపాటు పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం యజమాని తీవ్రంగా గాయపడ్డారు. హార్బర్ సమీపంలోని బుక్కా వీధిలో బీచ్‌రోడ్డును ఆనుకుని హిమాలయా బార్ పక్కన చల్లా గణేష్ కుమార్ (40) వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లి వచ్చే బోట్ల విడిభాగాలు దెబ్బతింటే వాటిని వెల్డింగ్ చేసి మరమ్మతులు చేస్తుంటారు. ఆ దుకాణంలో గణేష్‌తో పాటు ఒడిశాకు చెందిన శ్రీను, మధురవాడకు చెందిన కె.ఎల్లాజీ, బుక్కావీధికి చెందిన చింతకాయల ముత్యాలు (27), వన్‌టౌన్‌కు చెందిన డి.సన్యాసిరావుతోపాటు మరో ముగ్గురు పనిచేస్తున్నారు. సరిగ్గా సాయంత్రం 4.30 గంటల సమయంలో దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ ధాటికి చెక్క, రేకులతో కూడిన వెల్డింగ్ షాప్ తునాతునకలైపోగా, పక్కనున్న అలాంటివే మరో రెండు దుకాణాలు సైతం దెబ్బతిని చెల్లాచెదురైపోయాయి. షాప్ యజమాని గణేష్ కుమార్, శ్రీను శరీరాలు పూర్తిగా కాలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ముత్యాలు కాలు విరిగిపోయి వేరొకచోట పడింది. ముఖం, ఛాతీ, చేతులు కాలిపోయాయి.ఎల్లాజీకి 95 శాతం శరీరం కాలిపోగా, సన్యాసిరావు పొట్ట, శరీరంలోకి ఇనుపముక్కలు దూసుకుపోయాయి. పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం యజమాని చెంగలరావుపేట, తెలకల వీధికి చెందిన ఇప్పిలి రంగారావుకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. ముత్యాలుకు చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచారు.

# ఎస్టీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్



అమరావతి, ఆగస్టు 8(సందేశం టైమ్స్): ఎస్టీ యువతకు ఉద్యోగావకాశాల కోసం పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు కానున్నాయి. ఈమేరకు అనుమతి ఇస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నంలోని వేపగుంట, విజయవాడ,/గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపడంతో ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడాదికి రూ.4.22 కోట్లు మంజూరుచేయనున్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని డైరక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

# విద్యార్థిని ఫొటోలు అడ్డుపెట్టుకుని వేధింపులు

దివాన్‌చెరువు ఆగస్టు 8(సందేశం టైమ్స్): ఫొటోలు అడ్డుపెట్టుకుని విద్యార్థినిని వేధిస్తున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అడహక్ సహాయ ప్రొఫెసర్ కె.యామినీ జ్యోత్స్న, మరో నలుగురు విద్యార్థులపై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం. తాను మరో వ్యక్తితో సాన్నిహిత్యంగా ఉండడాన్ని ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తనను వేధిస్తున్నారంటూ యామినీ జ్యోత్స్నతో పాటు మరో నలుగురు విద్యార్థులపై బయోటెక్నాలజీ విద్యార్థిని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. నన్నయ వర్సిటీలో పనిచేస్తున్న ఇద్దరు తాత్కాలిక అధ్యాపకుల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో తనను టార్గెట్ చేసి మానసికంగా వేధిస్తున్నారంటూ ఆ విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు వివిధ సెక్షన్ల కింద యామినీ జ్యోత్స్నతో బాటు మరో నలుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# జుట్టు మొలిపిస్తామని.. ముంచేశారు



### కాకినాడలో ఓ సంస్థ మోసంపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
### రూ.90 వేలు కట్టించుకోవడంతో పాటు టెస్టులతో తొమ్మిది నెలలుగా తాత్సారం
### ఉన్న జుట్టు కూడా కట్ చేయించిన వైనం

%కాకినాడ క్రైం,ఆఆగస్టు 8(సందేశం టైమ్స్):మీ తలపై జుట్టు లేదా.. అయితే మా దగ్గరకు రండి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి జుట్టు మొలిపిస్తాం..' అంటూ ఓ సంస్థ ప్రకటన చూసి మోసపోయాడో వ్యక్తి! ఈ ఘటనకు సంబంధించి కాకినాడ టూటౌన్ పోలీసస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా వున్నాయి... తలపై జుట్టులేని చోట ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో జుట్టు రప్పిస్తామనే ఒక ప్రకటనను చూసిన కాకినాడకు చెందిన కె.సురేష్.. నగరంలోని శ్రీనగర్ సీతాపతి స్వప్నసౌధ అపార్ట్‌మెంట్‌లో ఉన్న వీఆర్‌ఎస్ హెయిర్ క్రియేషన్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ నిర్వాహకులు తమవద్ద 9 నెలల ట్రీట్‌మెంట్ ఉంటుందని, రూ.98వేల ప్యాకేజీతో తలపై మెండుగా జుట్టు రప్పిస్తామని చెప్పారు. సురేష్ దగ్గర రూ.10వేలతో పాటు వారే రూ.80వేలు ప్రైవేటు ఫైనాన్స్ చేయించి సంస్థకు జమ చేయించారు. సుమారు 9నెలల నుంచి ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పి, టెస్టులు చేయించుకుని రమ్మంటూ కాలయాపన చేశారని బాధితుడు పేర్కొన్నారు. వెళ్లిన ప్రతిసారీ టెస్టులకు రూ.3వేల నుంచి రూ.4వేల ఖర్చుయ్యేదని తెలిపారు. ఈ నెల 5న ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పి.. తలపై ఉన్న మొత్తం జుట్టును ఒడిసా నుంచి తీసుకొచ్చిన బార్బర్లతో తీయించాడని వాపోయాడు. ఇంటి నుంచి బయటకు రావడానికి మానసిక క్షోభ అనుభవిస్తున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. ట్రీట్‌మెంట్ చేయకుండా షుగరు, బీపీ ఉందని తాత్సారం చేస్తుండడంతో గత్యంతరం లేక పోలీసులను ఆశ్రయించానన్నారు.

# నూజివీడు అభివృద్ధికి రూ.30 కోట్లు

లనూజివీడుఆగస్టు 8(సందేశం టైమ్స్): నూజివీడు నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పను లకు రూ.30 కోట్లు మంజూరయ్యాయని మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాలువలు, చెరువు పనులకు రూ.22 కోట్లు, నూజి వీడు పట్టణా భివృద్ధికి రూ.5 కోట్లు, బలివే ఆలయ అభివృద్ధికి రెండున్నర కోట్లు మంజూరయ్యా యన్నారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. పోలవరం ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్‌కెనాల్ పనులు నవంబర్‌లో పూర్తి అవుతాయని, రైట్ మెయిన్ కెనాల్ పనులు 2027కి పూర్తి చేస్తారని తెలిపారు. చింతలపూడి పథకానికి అడ్డంకిగా ఉన్న లీగల్ సమస్యలను త్వరలో తొలగించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయటానికి పనులు జరుగుతున్నాయన్నారు. కృష్ణానది నుంచి వృ?థాగా సముద్రంలో కలుస్తున్న జలాలను వాటా లేకపోయినా ఏపీలోని పంట సాగుకు అనుమతి కోరగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎన్ఆర్ ఈజీఎస్ పనుల బిల్లులు చెల్లించలేదని, వాటి కోసం ఈనెల 11వ తేదీలోపు బిల్లులు ఆన్‌లైన్ చేసుకో వాలని నెలాఖరుకు బిల్లులు చెల్లిస్తామని మంత్రి అన్నారు. గతంలో అర్బన్ , రూరల్ పరిధిలో నిర్మించిన గృహాలకు కొన్ని సమస్యల కారణంగా బిల్లులు చెల్లింపు జరగలేదని కేంద్రమంత్రితో మాట్లాడి త్వరలో బిల్లులు జమ చేస్తామన్నారు.

# ఆరు కుంకీలతో ఆపరేషన్



బంగారుపాళ్యం,ఆగస్టు 8(సందేశం టైమ్స్):పంటపొలాలపై దాడులు చేస్తున్న ఏనుగుల ఆట కట్టించేందుకు మరోసారి కుంకీలను అటవీప్రాంతానికి తరలించారు.గురువారం సాయంత్రం బంగారుపాళ్యం మండలంలోని కీరమంద,కొదలమడుగు అటవీ పరిసర ప్రాంతాలకు ఆరు కుంకీ ఏనుగులను తరలించారు.వీటిలో కర్ణాటక రాష్ట్రం నుంచి రప్పించిన రంజన్,దేవ,అభిమన్య,కృష్ణతో పాటు రామకుప్పం మండలం ననియాల తాండా శిబిరం నుంచి తీసుకొచ్చిన వినాయకం,జయంత్ ఏనుగులున్నాయి. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు సంచరిస్తున్నాయన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు ఈ ఆపరేషన్ మొదలుపెట్టారు.పలమనేరు సబ్ డీఎఫవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో 12మంది మావటీలు,40 మంది అటవీశాఖ సిబ్బంది పాల్గొన్న ఈ ఆపరేషన్‌ను డీఎఫవో భరణి రాత్రి కీరమంద అటవీప్రాంతానికి చేరుకుని పర్యవేక్షించారు.

# వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ




హిందూపురం,ఆగస్టు 8(సందేశం టైమ్స్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు హిందూపురం పురపాలక సంఘం పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, సెర్ప్ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 100 అడుగులతో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 వ తేదీన ప్రతి ఇంటి పైన జాతీయ పతాకాన్ని ఎగరవేసి, దేశ సమైక్యతను, సమగ్రతను చాటుకోవాలని, దేశాభిమానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎంసి ఎల్.గంగులయ్య, సెర్ప్ ఎ.పి.యం. జి.రామాంజినేయులు, సి.ఓ.లు తౌసిఫ్, నాగేంద్ర, సదానంద, వరలక్ష్మి గంగరత్న, డి.ఈ.ఓ. ఇబ్రహీం ఖాన్, పట్టణ సమాఖ్య ఓ.బి.లు, అన్ని సమాఖ్యల ఆర్.పి.లు, సెర్ప్ విఓఎలు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

ఓబుళదేవర చెరువు ,ఆగస్టు 8(సందేశం టైమ్స్):అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ లోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు గ్రాడ్యుటి సౌకర్యం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ప్రమోషన్ కల్పించే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈసందర్భంగా నూతన ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మణిమాల, ప్రధాన కార్యదర్శిగా రంగమ్మ, మినీ అంగనవాడి యూనియన్ లీడర్‌గా భారతి ఎన్నుకున్నారు.ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ ,స్వర్ణ, సరళ, సునీత భారు, షమీం తదితరులు పాల్గొన్నారు. కదిరి టౌన్ : అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కదిరి పట్టణం పులివెందుల రోడ్ లోని అంగన్వాడీ ప్రాజెక్టు లో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత వైసిపి ప్రభుత్వంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. ఈ సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వం అంగన్వాడీల



సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి అవుతున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీల వేతనాలు పెంచాలన్నారు. అదేవిధంగా కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2జి ఫోన్లు ఇచ్చి రకరకాల యాప్ ల పేరుతో ఇబ్బందులకు గురవుతున్నారాని ఈ ఫోన్లతో విసిగిచెంది అంగన్వాడీలు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పారని అన్నారు. ప్రభుత్వం నాణ్యమైన ట్యాబ్లు ఇవ్వాలని అన్ని సేవలకు సంబంధించి ఒకే యాప్ ను రూపొందించాలని కోరారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు , అంగనవాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, మాబున్నీసా, శ్రీదేవి, సుశీల, సుజాత, రామలక్ష్మి, వకుల, మాధవి , సిఐటియు నాయకులు జగన్మోహన్ , బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహెూన్నత పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు




%కర్నూలు కల్చరల్,,ఆగస్టు 8(సందేశం టైమ్స్): మహెూన్నత పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు అని నగర బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. కృష్ణరాయల 516వ పట్టాభిషేక దినోత్సవం సందర్భం గా నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో నగరం లోని కిసానఘాట్ వద్ద గల శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత శ్రీకృష్ణదేవరాయలకే దక్కుతుందని శ్లాఘించారు. నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్ మాట్లా డుతూ శ్రీకృష్ణ దేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించి, ఆయన చేసిన మంచి పనులును నేటి తరం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సంఘం ప్రధాన సలహాదారు డాక్టర్ సింగంశెట్టి సోమ శేఖర్ మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు బలిజ లకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస మూర్తి, శేలేష్, కార్పొరేటర్ స్వామిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ పవనకు మార్, విజయ్‌కుమార్, విజయభాస్కర్, కిరణ్మయి, ప్రకాశబాబు, ఆంజనే యులు, చలపతి, ఈరన్న, శ్రీనివాస్, శ్రీకాంత పాల్గొన్నారు.

# తాగేది ఎలా..?



,ఆగస్టు 8(సందేశం టైమ్స్):మున్సిపాలిటీ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు ఆకు పసరు రంగులో వచ్చింది. బ్రౌన్ పేట, కుమ్మర వీధి కొత్తపేట, 6వ వార్డు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ఆకు పసరు రంగులోనే నీరు సరఫరా అవుతోంది. ఇలాంటి నీటిని ఎలా తాగాలని, ఈ నీటితో వంట, స్నానాలు ఎలా చేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారణాలు పరిశీలిస్తున్నాం కుళాయిల్లో ఆకు పసరు రంగులో నీరు రావడానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య అన్నారు. స్థానిక బడేలమ్మ చేరువులో చేపల వేట కోసం నీటిని మోటారు సహాయంతో బయటకు పంపిస్తుండగా ఆ జలాలు పైపులైన్ల లీకుల ద్వారా కుళాయిల్లోకి వస్తున్నట్టు అనుమానంతో తమ సిబ్బందితో లీకులు గుర్తించే చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. బడేలమ్మ చెరువులో జలాలు బాగా ఆకు పసరుగా ఉన్నందున అవే కలుషితం అయ్యే అవకాశం ఉన్నట్టు ఆమె చెప్పారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు ఈ పరిస్థితి లేదని, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సమస్య ఉన్నందున పరిస్థితి చక్కదిద్దనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం బడేలమ్మ చెరువులో నీటిని బయటకు పంపింగ్ చేసే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేసినట్టు ఆమె తెలిపారు.

# పాముకాటుతో వ్యక్తి మృతి



,ఆగస్టు 8(సందేశం టైమ్స్)::ముసునూరు పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ూ% మండలంలోని కొర్లకుంట శివారు సింహాద్రిపురం గ్రామానికి చెందిన చందమాల గాబ్రియేలు (45) సాయంత్రం వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం పొలంలోకి వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించిమృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# చేపలు మృత్యువాత

,ఆగస్టు 8(సందేశం టైమ్స్):మండలంలోని దొడ్డ నపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో గల చేపల చెరువులో వందల సంఖ్యలో చేపలు మృతిచెందాయి. దీంతో ఆ చెరువును లీజు తీసుకుని, చేపలు పెంచుతున్న కాళ్ల గ్రామానికి చెందిన వి.సత్యనారాయణ లబోదిబోమంటున్నారు. చేపలు తేలిపోవడంతో చేపలను గట్లపై పూడ్చి వేస్తున్నారు.100 టన్నుల చేపలు చనిపోయాయిపి.సత్యనారాయణ, ఆక్వా రైతు, కాళ్లదొడ్డనపూడి గ్రామంలో 75 ఎకరాల చేపల చెరువులు సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుతం కేజీ చేప ధర రూ.118 ఉంది. కేజీన్నర, రెండు కేజీల చేపలు ఆకస్మాత్తుగా చేపల చెరువులో సుమారు 100 టన్నుల చేపలు చనిపోయాయి. వాటి విలువ రూ.కోటి 50 లక్షలు ఉంటాయి. వాతావరణం తేడా అనుకుంటే చుట్టుపక్కల చెరువులు బాగానే ఉన్నాయి. విషయం ఏమిటో అర్థం కావడం లేదు. మత్స్యశాఖ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.చేపలకు వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలిఎం.ఇందిర ప్రియదర్శిని,



మత్స్యశాఖ అధికారిణి, కాళ్లచెరువులోని నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గడం, పిహెచ్ స్థాయి మారడం వల్ల చేపల మరణానికి దారితీస్తాయి. ముఖ్యంగా ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. దీనివల్ల చేపలు ఊపిరాడక చనిపోతాయి. కొన్ని రకాల వ్యాధులు చేపలకు సోకినప్పుడు అవి మరణిస్తాయి.

# బీసీలపై కక్ష సాధింపు చర్యలు తగవు



నంద్యాల రూరల్, ,ఆగస్టు 8(సందేశం టైమ్స్):: బీసీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగవని వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ నాయుడు అన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలపై దాడులు ఆపకపోతే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. బీసీలకు రక్షణ కరవైందని ఆరోపించారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడికి నిరసనగా నంద్యాలలో నిరసన తెలిపినట్లు తెలిపారు. నాయకులపై కక్ష సాధింపు చర్యలు మంచిది కాదన్నారు. బీసీ నాయకులు పుల్లయ్య, చిన్నబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

# 176మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



పార్వతీపురం ,ఆగస్టు 8(సందేశం టైమ్స్):స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో నిర్వహించిన కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంలో 176మంది పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ నాగభూషణరావు ప్రారంభించారు. 65మందికి నోటికి సంబంధించిన కేన్సర్ పరీక్షలు నిర్వహించగా నలుగురు అనుమానితులుగా, ఒకరికి నాలుక కేన్సర్‌గా నిర్ధారించారు. బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించి 91మందికి పరీక్షలు నిర్వహించగా 20మందిని అనుమానితులు గా నిర్ధారించారు. వీరికి డిజిటల్ మెమోగ్రఫీ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎవరికీ కేన్సర్ నిర్ధారణ కాలేదు. మరో 20మందికి గర్భసంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా పదిమందిని అనుమానితులుగా నిర్ధారించారు. వీరికి ప్యాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. వారం రోజుల్లో వీరి రిపోర్టులు రానున్నాయని వైద్యులు తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివనాగజ్యోతి పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరంలో దంత వైద్యులు డాక్టర్ హారిక, డాక్టర్ కె.పాల్,మెమోగ్రఫీ టెక్నీషియన్స్ లక్ష్మీ, సుమన్, జిల్లా కేంద్ర ఆసుపత్రి దంత వైద్యులు డాక్టర్ దినేష్ కుమార్, డాక్టర్ శ్యామల పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు: డీజీపీ



అమరావతి,,ఆగస్టు 8(సందేశం టైమ్స్):: విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో గంజాయి, డ్రగ్స్, సిగరెట్లు, గుట్కా, కాఫ్ సిరప్‌లు విక్రయించరాదన్న టోబాకో మార్గదర్శకాలను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో గత నెల 8 నుంచి 12 వరకూ 26 జిల్లాల్లో చేపట్టిన దాడుల్లో.. 16,806 దుకాణాలను తనిఖీ చేశామని, 25,807 కేసులు నమోదు చేసి రూ.40.62 లక్షల మేర జరిమానా విధించినట్లు వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదు కాగా.. పశ్చిమ గోదావరి, కడప, అన్నమయ్య జిల్లాల్లో తక్కువ నమోదైనట్లు చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం శుభ పరిణామమన్నారు. విద్యార్థులు ఎవ్వరూ మత్తు బారిన పడకుండా జిల్లాల ఎస్పీలతో ఈగల్ విభాగం సమన్వయం చేసుకుని చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని తెలియజేయాలని ప్రజలను డీజీపీ కోరారు.

# బియ్యం.. బొక్కేస్తున్నారు..

- పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం
- కొందరు డీలర్ల నుంచే నేరుగా వ్యాపారులకు..
- కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయం
- తేటతెల్లం చేస్తున్న బఫర్ లెక్కలు
- ఒక్కో షాపు నుంచి ప్రతినెలా 20 సంచుల వరకు..



అనంతపురం ,ఆగస్టు 8(సందేశం టైమ్స్): పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని బొక్కేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో ఏకంగా బియ్యం సంచులే మాయమవుతున్నాయి. నేరుగా వ్యాపారులకు బియ్యం చేరుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అందుకు ఎఫ్‌పీ షాపుల్లో కనిపిస్తున్న బఫర్ స్టాకే నిదర్శనం. కొన్ని దుకాణాల్లో పదుల సంఖ్యలో బియ్యం బస్తాల కొరత కనిపిస్తోంది. పేదల బియ్యం ద్వారా డబ్బు దోచుకునే వ్యవహారం గత వైసీపీ హయాంలో జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు డీలర్లు కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ముడుపులతో చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రజలకు అందాల్సిన బియ్యం కొందరు అక్రమార్కుల పాలవుతోంది. ఈ దందా జిల్లా కేంద్రమైన అనంతపురంతోపాటు పట్టణాల్లోనే ఎక్కువగా సాగుతోంది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోనూ పెద్దఎత్తున పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది.

# బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవదానం

బ్రెయిన్ డెడ్ అయిన బలరామకృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యులు




–గుంటూరు జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 8(సందేశం టైమ్స్): గుంటూరులో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి చెందిన అవయవాలను దానం చేయడం ద్వారా ఏడుగురికి ప్రాణదానం చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లో ఉంటున్న 59 ఏళ్ల కనగాల బలరామకష్ణ ఈనెల 3వ తేదీన స్థానిక గుజ్జనగుండ్ల నుండి పట్టాభిపురం వైపు సైకిల్‌పై వెళుతుండగా కారు ఢకొని తలకు తీవ్ర గాయమైంది. ఆయన్ను స్థానిక ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స అందిస్తూ బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. అతని కుటుంబీకులకు ఈ విషయాన్ని చికిత్సను అందిస్తున్న న్యూరాలజీ చీఫ్ డాక్టర్ కుమారవేల్ వివరించారు. డాక్టర్ల సూచనల మేరకు జీవన్ దాన్ ట్రస్ట్ ద్వారా అవయవదానం చేసేందుకు కుటుంబీకులు ముందుకొచ్చారు. ఏడుగురు వ్యక్తులకు శరీరంలోని ఏడు కీలక అవయావాలను పంపేందుకు ఆస్పత్రి నిర్వాహకులు గ్రీన్ ఛానల్ ద్వారా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు జీవన్ దాన్ ట్రస్ట్ తరుపున గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ మట్టిలో కలిసి పోయే ఈ శరీరం మరో 10 మందికి ప్రాణాలు పోస్తుందని గ్రహించాలని అపోహలు వీడి ప్రతి ఒక్కరు జీవన్దాన్ లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. డాక్టర్ రాయపాటి మమత, కనగాల అనూష తదితరులు పాల్గొన్నారు.

# పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమల,,ఆగస్టు 8(సందేశం టైమ్స్):తిరుమలలో పవిత్ర పూర్ణాహుతితో మూడురోజుల పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం యాగశాలలో ఋత్విక్కులు హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విశేష సమర్పణ, 4 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగాయి. రాత్రి 7 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవిలతో కూడి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



వల్లూరు (కడప) ,ఆగస్టు 8(సందేశం టైమ్స్):కడప తాడిపత్రి జాతీయ ప్రధాన రహదారి గోటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం పొద్దుటూరు నుంచి కడపకు వస్తున్న బస్సు వెనుక వైపు బైక్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు సడన్గా బ్రేక్ వేయడంతో ఘటన జరిగినట్లు అక్కడున్న స్థానికుల సమాచారం గాయాలైన వ్యక్తి గంగయ్య పల్లెకు చెందిన దుగ్గన్న గారి శ్రీనివాసులరెడ్డి గుర్తించారు. తలకు తీవ్ర గాయాలైన శ్రీనివాసుల రెడ్డిని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 వాహనం ద్వారా కడప రిమ్స్ కు తరలించారు.

# వాసవి మాతకు సారె సమర్పణ




విజయనగరం టౌన్ :,ఆగస్టు 8(సందేశం టైమ్స్):వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల ప్రకారం శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా వాసవి క్లబ్ విజయనగరం అధ్యక్షులు విజ్జపు విజయ్ ఆధ్వర్యంలో 'చీర సారె' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం కు పట్టు వస్త్రాలు, 52 రకాల పిండి వంటలతో సారె సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజ్జపు విజయ్ మాట్లాడుతూ లోకకళ్యాణార్థం ప్రజలు సిరిసంపదలతో తులతూగాలని వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. కేబినెట్ సెక్రటరీ(అడ్మిన్) ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ నిరంతరం సమాజసేవా కార్యక్రమంలు చేపడుతుండడం వాసవి క్లబ్ ముఖ్య ఉద్దేశ్యం అని, త్వరలో పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.వి. కృష్ణారావు,మాచర్ల చంద్రశేఖర గుప్త,డిప్స్ రాజు,కట్టామూరి శంకర్రావు, గుడిశ వినోద్, ప్రాజెక్ట్ చైర్మన్ రత్నారావు,రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు,క్లబ్ కార్యాదర్శి నానాజీ, కోశాధికారి కఠస్వారావు, కుమార్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో సరికొత్త సేవలు..
## ఇంటి వద్దనే ఎఫ్ఐఆర్



హైదరాబాద్:,ఆగస్టు 8(సందేశం టైమ్స్): ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు సరికొత్త సేవలనుప్రారంభించారు. బాలానగర్ పీఎస్ పరిధిలో ఫిర్యాదు దారుల ఇంటివద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలానగర్ ఎస్‌హెచ్‌వో నరసింహరాజు, ఎస్ఐలు సరితాపటేల్ రెడ్డి, వినోద్ హనుమాన్ దేవాలయం, పట్వారి ఎన్‌క్లేవ్, కామాక్షి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌ల వద్దకు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు ఫిర్యాదు దారుల ఇళ్ల వద్దకు రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.%పోలీసులపై నమ్మకం కలిగేలా చర్యలు పోలీసులపై మరింత నమ్మకం కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఫిర్యాదులు తీసుకోవడంతోపాటు కాపీని వారికి అందజేస్తాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

# రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం..
## బోగిలో చెలరేగిన మంటలు



,ఆగస్టు 8(సందేశం టైమ్స్):మహబూబాబాద్ కేసముద్రం రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మొబైల్ రెస్ట్ బోగిలో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. డోర్నకల్–కాజీపేట మధ్య 3వ రైలు నిర్మాణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. నిర్మాణ పనుల్లో భాగమైన ఉద్యోగుల కోసం కేసముద్రం రైల్వే స్టేషన్‌లో మొబైల్ బోగిని ఏర్పాటు చేశారు. మొబైల్ రెస్ట్ బోగి లూప్‌లైన్‌లో నిలిచి ఉంది. ఏమైందో ఏమో తెలీదు కానీ, ప్రమాదవశాత్తు బోగిలో మంటలు చెలరేగాయి.మంటలు అంటుకున్న సమయంలో బోగిలో ముగ్గురు ఉద్యోగులు ఉన్నారు. మంటల్ని గమనించిన వారు వెంటనే బయటకు వచ్చారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. ఒక వేళ ఈ సంఘటన అర్ధరాత్రి వారు నిద్రమత్తులో ఉన్నపుడు జరిగి ఉన్నా.. డోరు సరైన సమయానికి ఓపెన్ కాకపోయి ఉన్నా పెను విషాదం చోటుచేసుకుని ఉండేది. సరైన సమయంలో అగ్ని ప్రమాదాన్ని గుర్తించి వారు బయటపడ్డారు. ఇక, మంటల్లో ఆ బోగి కాలిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటనపై విచారణ చేస్తున్నారు.ఈ మధ్య కాలంలో రైలులు తరచుగా అగ్ని ప్రమాదానికి గురవుతూ ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం తిరుపతి రైల్వే యార్డులో అగ్ని ప్రమాదం సంభవించింది. హిస్సార్–తిరుపతి మధ్య నడిచే వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును చింతలచేను సమీపంలో పార్కింగ్ చేస్తుండగా చివరి నుంచి రెండో బోగీలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటి తర్వాత పక్కనే నిలిచి ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగికి కూడా మంటలు వ్యాపించాయి. దాని పెయింట్ కాలిపోయింది. హిస్సార్–తిరుపతి రైలు బోగి పూర్తిగా కాలిపోయింది.

# ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు
## అరుదైన గుర్తింపు




హైదరాబాద్ సిటీ,,ఆగస్టు 8(సందేశం టైమ్స్): ప్రపంచంలోనే.. కార్నియల్ న్యూరోటైజేషన్ శస్త్రచికిత్స నిర్వహించే అగ్రగామి కంటి చికిత్స కేంద్రాల్లో ఒకటిగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్(ఎల్వీపీఈఐ)కు గుర్తింపు దక్కింది. 2019 నుంచి ఇప్పటిదాకా ఎల్వీపీఈఐ ఈ తరహా శస్త్రచికిత్సలు 40కి పైగా చేసి అత్యుత్తమ ఫలితాలు నమోదుచేసింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. గట్టిగా గాలి వీచి దుమ్ము లేస్తే.. అసంకల్పితన ప్రతీకారచర్యగా మనం కనురెప్పలు ఆడిస్తాం. కంట్లో ఏదైనా నలుసు పడితే.. వెంటనే కళ్లల్లో నీరు వచ్చి దాన్ని బయటకు నెట్టాలని ప్రయత్నిస్తుంది. కార్నియాకు సహజంగా ఉండే సెన్సేషన్ (స్పర్శ, నొప్పి, ఉష్ణోగ్రత వంటివాటిని గుర్తించే సామర్థ్యం) కారణంగా ఈ చర్యలన్నీ జరుగుతాయి.పుట్టుకతో వచ్చే సమస్యల కారణంగాగానీ, న్యూరోసర్జరీ సమయంలో నాడులు దెబ్బతిన్నప్పుడుగానీ.. కార్నియాకు ఉండే ఆ సహజ సామర్థ్యం పోతుంది. అలాంటి సందర్భాల్లో.. నుదురు, కాలు వంటి ఇతర భాగాల నుంచి ఆరోగ్యవంతమైన సెన్సరీ నాడులను మైక్రో సర్జరీ ద్వారా కార్నియా సమీపంలో అతికిస్తారు. కొన్ని నెలల వ్యవధిలో అవి పెరిగి కార్నియా సెన్సేషన్‌ను పునరుద్ధరిస్తాయి. ఈ ప్రక్రియ కంటికి సాంత్వన కలిగించడమే కాక, దృష్టిని కాపాడడంలో కూడా సహాయపడుతుందని ఎల్వీపీఈఐ వైద్యులు తెలిపారు. ఈ ఆధునిక పరికరాలు చాలా కేంద్రాల్లో లభించవని.. పిల్లలు, పెద్దలకు వచ్చే న్యూరోట్రోఫిక్ కెరటిటిస్ చికిత్సలో ఏల్వీపీఈఐకి విశేష అనుభవం ఉందని వారు వివరించారు. ఇప్పటి వరకూ తాము నిర్వహించిన ఈ తరహా శస్త్రచికిత్సల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని వెల్లడించారు.

# నగరంలో వర్ష బీభత్సం..
## మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు అలర్ట్



,ఆగస్టు 8(సందేశం టైమ్స్):రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వర్షం దంచి కొట్టింది. హైదరాబాద్ నగరంలో నిన్న సాయంత్రం మొదలైన వర్షం అర్ధరాత్రి వరకు పడింది. కుండపోత వర్షం కావటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చింది. రోడ్లపై సైతం భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ఇక, భారీ వర్షాలతో హిమాయత్ సాగర్‌కు పెద్ద ఎత్తున వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలోనే అధికారులు హిమాయత్ సాగర్ గేట్లు తెరవనున్నారు. నీటిని దిగువన ఉన్న మూసీలోకి విడుదల చేయనున్నారు. దీంతో మూసీ పరివావర్ష బీభత్సం కారణంగా హైదరాబాద్ నగరంలోని మణికొండ మున్సిపాలిటీలో పలు కాలనీలు నీట మునిగాయి. సాయంత్రం నుంచి కురిసిన వర్షానికి సెల్లార్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. సెల్లార్లలోని వాహనాలు నీట మునిగిపోయాయి. సమాచారం అందుకున్న మణికొండ మున్సిపల్ కమిషనర్ స్పాట్‌కు చేరుకున్నారు. సెల్లార్లలోని నీటిని క్లియర్ చేయించారు. రోడ్లకు గండి కొట్టి, మోటార్లతో సెల్లార్లలోని వర్షపు నీటిని క్లియర్ చేశారు. ఇక, వర్షాల కారణంగా కైరా స్కూలు సమీపంలోని ఓ ఇల్లు కూలిపోయింది.

# గుండెపోటుతో
## తహసీల్దార్ మృతి



నెన్నెల ,ఆగస్టు 8(సందేశం టైమ్స్): నెన్నెల తహసీల్దార్ ముదమల్ల జ్యోతి ప్రియదర్శిని (50) రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆమె స్వస్థలం జగిత్యాల కాగా ఒంటరిగా సీసీసీ నస్పూర్‌లో నివాసం ఉంటు న్నారు. మంగళవారం నెన్నెలలో విధులు ముగించుకొని సీసీసీలోని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి తనకు చాతిలో నొప్పి వస్తోందని ఆసుపత్రికి వెళ్లేందుకు వెంటనే ఇంటికి రావాలని తన కారు డ్రైవర్‌కు ఫోన్‌చేసి చెప్పారు. డ్రైవర్ ఇంటికి వచ్చి చూసే సరికి అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్నారు. పొరుగువారి సహకారంతో ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు. కోటపల్లి, చెన్నూరు మండలాల్లో తహసీల్దార్‌గా, బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా సేవలదించిన జ్యోతి ప్రియదర్శిని గత నెల 9న బదిలీపై నెన్నెలకు వచ్చారు. అనతి కాలంలోనే ప్రజలు, అధికారుల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. మంగళవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనులు చేసి పెట్టాలని సూచించారు. ఆమె మాట్లాడిన ఆఖరు మాటలను సిబ్బంది మననం చేసుకున్నారు. ప్రజాసేవ కోసం తమ తహసీల్దార్ తపించేవార ని సిబ్బంది పేర్కొన్నారు. అధికారులు, నాయకులు ఆమె పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. జగిత్యాలలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

# ఉచిత టాయిలెట్ల వద్ద డబ్బులు వసూలు

అలంపూర్ ,ఆగస్టు 8(సందేశం టైమ్స్)::అలంపూర్‌లోని ఐదవశక్తి పీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో ఉన్న ఉచిత మూత్రశాలలు, మరుగుదొడ్లు ప్ర స్తుతం వినియోగంలోకి వచ్చాయి. గతంలో ఉ న్న వాటిని ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వారు తొలగించి, అక్కడే కొత్తవి నిర్మించారు. దేవస్థా నం వారికి అప్పగించారు. గతంలో వేలంపాట లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణను దక్కించుకున్న వారు, ప్రస్తుతం కొత్త మరుగు దొడ్ల వద్ద వినియోగదారుల నుంచి రూ.10 – రూ.15 వరకు బోర్డుపెట్టి మరీ వసూలు చేస్తు న్నారు. ఈ విషయాన్ని చూసి కొందరు భక్తులు ఆలయాలకు వచ్చిన భక్తులతో ఇలా అధిక డ బ్బులు వసూలు చేయడం తగదని అంటున్నా రు. ఈ విషయమై ఆలయ ఈవో పురేందర్‌కు మార్‌ను సంప్రదించగా మూత్రశాలల విష యం తమదృష్టికి రాలేదని, వెంటనే పరిశీలించి తగుచర్యలు తీసుకుంటానని తెలిపారు.

# మూడు రోజుల బాబుకు అరుదైన శస్త్ర చికిత్స ..
## వైద్యులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు




కంటేశ్వర్ ,ఆగస్టు 8(సందేశం టైమ్స్)::నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ ఆసుపత్రిలో మూడు రోజుల మగ శిశువుకు అరుదైన లేపరోటమి కోలస్టమి శస్త్ర చికిత్స ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవేందర్ ఆసుపత్రి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు.%ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి ఇబ్రహీంపట్నంకు చెందిన గంగా ప్రవళిక గత నెల జులై 25 న డెలివరీ అయిన తర్వాత పుట్టిన బాబుకు మల విసర్జన( మోషన్) రాకపోవడంతో జులై 28న జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తీసుకువచ్చినట్టు వివరించారు. బాబుకు అన్ని రకాల పరీక్షలు చేశాక ఇంతస్టైనల్ అబ్స్ట్రక్షన్ చిన్న పేగులో దూరడంతో కడుపులో నొప్పితో పాటు యూరిన్, స్టోల్ సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా వైద్యుల బృందం లాపరోటమీ అనే సాధారణ చికిత్స విధానం ద్వారా ఉదర అవయవాలను పరిశీలిస్తూ కొలోస్టమీ అనే నిర్దిష్ట రకమైన స్టోమా శస్త్ర చికిత్స ద్వారా మలం బయటకు వెళ్లడానికి పెద్దప్రేగులో ఓపెనింగ్ (స్టోమా)ను సృష్టించి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసినట్టు తెలిపారు.ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్ , ఆపరేషన్ హెడ్ హరికృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నతమైన వైద్యం అందించే లక్ష్యంగానే నిజామాబాదులో వెల్‌నెస్ హాస్పిటల్ ఏడవ బ్రాంచ్‌ను ప్రారంభించామని తెలిపారు. తమ హాస్పిటల్ వైద్యులు 24/7 అందుబాటులో ఉంటారని ఏ సమయంలో వచ్చిన ఎటువంటి సమస్యకైనా అవసరమైన అత్యవసర చికిత్స అందిస్తామని తెలిపారు.అతి తక్కువ ఖర్చుతోనే హైదరాబాద్ వెళ్లకుండా నిజామాబాదులోనే పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు ఆసుపత్రి సిద్ధంగా ఉందని, జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు.



# క్రీడావార్తలు



## అయ్యర్ ఆడేది ఖాయమే

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో ఐదు టెస్టుల సిరీసతో ఆకట్టుకున్న టీమిండియా ఇప్పుడిక ఆసియాక్‌పపై దృష్టి సారించనుంది. అయితే ఇది టీ20 ఫార్మాట్‌లో జరుగనుండడంతో జట్టు సభ్యులు కూడా మారనున్నారు. అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య సెప్టెంబరు 9 నుంచి 28 వరకు యూఏఈలో ఈ టోర్నీ జరిగేలా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. అదే నెల 14న ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించే భారత్-పాక్ పోరు కూడా జరుగుతుంది. 8 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో దుబాయ్, అబుధాబి వేదికలుగా మొత్తం 19 మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మరోవైపు ఆసియాక్‌పలో పాల్గొనే భారత జట్టు కూర్పుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈనెల మూడో వారంలో బీసీసీఐ తమ టీ20 జట్టును ప్రకటించే అవకాశం ఉంది. అయితే మరో ఐదు నెలల్లోనే టీ20 వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఆ మెగా టోర్నీని దృష్టిలో ఉంచుకుని కూడా తాజా జట్టును ఎంపిక చేయాల్సిన బాధ్యత సెలెక్టర్లపై ఉంది. అయితే టెస్టు, వన్డేల మాదిరి కాకుండా టీ20 జట్టులో స్థానం కోసం విపరీత పోటీ నెలకొని ఉంది.




అంతేకాకుండా టెస్టు ఫార్మాట్‌లో మాదిరి జట్టు సంధి దశలో కూడా లేదు. మరోవైపు ఇంగ్లండ్‌లో పర్యటించిన జట్టు ఆటగాళ్లలో గిల్, బుమ్రా, రాహుల్, పంత్, సిరాజ్ ఆసియాక్‌పలో ఆడే అవకాశం లేదని సమాచారం.నెంబర్ 4లో శ్రేయాస్: ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన ఆటగాళ్లంతా బెర్త్ కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా విశేష ప్రతిభ చూపి జట్టును రన్నరప్‌గా నిలిపిన శ్రేయాస్ అయ్యర్‌కు ఈసారి పిలుపు ఖాయమేనని అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాలంలో అతడిని టెస్టు, టీ20లకు పక్కనబెట్టి వన్డేల్లో ఆడిస్తున్నారు. కానీ ఐపీఎల్‌లో తను 17 మ్యాచ్‌ల్లో 604 పరుగులు చేసి బ్యాటర్‌గానూ సక్సెస్ అయ్యాడు. ఓవరాల్‌గా ఏడాది కాలంలో ఆడిన 25 ఇన్నింగ్స్‌లో 179.73 స్ట్రయిక్ రేట్‌తో 949 పరుగులు సాధించాడు.

అందుకే పొట్టి ఫార్మాట్‌లో శ్రేయాసను ఎంపిక చేసేందుకు ఈ ప్రదర్శన సరిపోతుందని భావిస్తున్నారు. భారత్ తరఫున అతడు 2023లో చివరి టీ20 ఆడాడు. రిషభ్ పంత్‌కు ఆరు వారాలపాటు విశ్రాంతి అవసరమైన నేపథ్యంలో కీపర్‌గా శాంసన్ ఎంపిక లాంఛనమే కానుంది. అయితే ఐపీఎల్‌లో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ సాధించిన విషయం తెలిసిందే. ఒకవేళ తన ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే శాంసన్‌ను మిడిలార్డర్‌లో ఆడించాల్సి ఉంటుంది. కెప్టెన్ సూర్యకుమార్‌కు ఈ ఏడాది ఆరంభంలో హెర్నియా సర్జరీ జరిగింది. దీంతో తను ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో ఉన్నాడు. తన ఫిట్‌నెసపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ తను కోలుకోలేకపోతే శ్రేయాసకు పగ్గాలు అప్పగించినా ఆశ్చర్యం లేదు. ఫినిషర్లుగా ఆల్‌రౌండర్లు హార్దిక్, అక్షర్ కొనసాగనుండగా కుల్దీప్, వరుణ్ ప్రధాన స్పిన్నర్లు కానున్నారు. పేస్ విభాగంలో అర్ష్‌దీప్, హర్షిత్, ముకేశ్ ఉంటారు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల్లోనూ ప్రాతినిధ్యం వహించిన సిరాజ్‌కు విండీసతో సిరీస్ కోసం తాజాగా ఉంచే అవకాశం ఉంది.

## 2025: అర్జున్ గెలుపు



చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి శుభారంభం చేయగా.. ద్రోణవల్లి హారికకు షాక్ తగిలింది. గురువారం జరిగిన ఓపెన్ తొలి రౌండ్‌లో అమెరికా జీఎం అవోండర్ లియాంగ్‌పై అర్జున్ నెగ్గాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 48 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. సహచరులు ప్రణవ్-కార్తికేయన్ మురళీ మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో నిహాల్ సరీన్ పరాజయం పాలయ్యాడు. చాలెంజర్స్ విభాగం తొలి రౌండ్‌లో సహచర జీఎం దీప్తయాన్ ఘోష్ చేతిలో హారిక ఓడింది. ఇనియన్‌తో గేమ్‌ను వైశాలి డ్రా చేసుకొంది.

## 11 మంది రెజ్లర్లపై వేటు

న్యూఢిల్లీ : నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన 11 మంది రెజ్లర్లను..భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) సస్పెండ్ చేసింది. రెజ్లింగ్ క్రీడకు హరియాణా ప్రసిద్ధి చెందినది. దాంతో ఆ రాష్ట్ర జట్టులో ఎంపికకు పోటీ తీవ్రంగా ఉండడంతో పలువురు ఢిల్లీ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఈక్రమంలో వారు ఢిల్లీలో జన్మించినట్టు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. వీటిపై అనుమానం వచ్చిన డబ్ల్యూఎఫఐ విచారణ చేయాల్సిందిగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌ను కోరింది. దర్యాప్తు



జరిపిన కార్పొరేషన్ 11 మంది రెజ్లర్ల జనన ధ్రువీకరణ పత్రాలు తాము జారీ చేయలేదని తేల్చింది. దాంతో సాక్షమ్, మనుజ్, కవిత, అన్ను, ఆరుష్ రాణా, శుభమ్, గౌతమ్, జగ్‌రూప్ ధన్కడ్, నకుల్, దుష్యంత్, సిద్ధార్థ బలియాన్ అనే రెజ్లర్లపై డబ్ల్యూఎఫఐ వేటు వేసింది.

## సిరాజ్‌కు తగినంత గుర్తింపు దక్కలేదు




న్యూఢిల్లీ: ఇంగ్లండ్ టూర్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతమని దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొనియాడాడు. అనూహ్య ప్రదర్శనతో అలరించిన పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. వాస్తవంగా అతడికి దక్కాల్సినంత గుర్తింపు దక్కలేదన్నాడు. 'మైదానంలో అతడి వ్యవహారశైలి నాకెంతో నచ్చుతుంది. ఎన్ని ఓవర్లు బౌల్ చేసినా అలుపనేదే కనపడదు. ఓ పేసర్ ఇంత ఉత్సాహంగా ఉండడం ఏ బ్యాటర్‌కూ నచ్చదు. చివరి రోజు వరకు సిరాజ్ అదే జోష్‌ను కొనసాగించాడు. సిరీసలో వెయ్యి బంతులు వేసినా.. అతడు పేస్ తగ్గకుండా గంటకు 145 కి.మీ. వేగంతో బౌలింగ్ చేయగలడని కామెంటేటర్లు చెప్పడం విన్నా. అది అతడి పోరాట తత్వానికి నిదర్శనం. ఓవల్ టెస్ట్ చివరి రోజు సిరాజ్ ప్రదర్శనను ఎంత పొగిడినా తక్కువే' అని సచిన్ అన్నాడు. సిరాజ్ ఇప్పుడు రాణిస్తున్నట్టే ఇంతకుముందూ అద్భుతంగా బౌల్ చేస్తూనే ఉన్నాడని, అయితే అతని ప్రతిభకు తగిన గుర్తింపు మాత్రం లభించలేదని సచిన్ చెప్పాడు. ఇక ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కూడా పరిణతి చెందిన ఆటను ప్రదర్శించాడని ప్రశంసించాడు. చివరి టెస్ట్‌లో బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై సెంచరీ చేయడం అసాధారణమన్నాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎంతో ప్రశాంతంగా జట్టును నడిపించాడని సచిన్ కొనియాడాడు.

## భారత మహిళల ఓటమి



మకే (ఆస్ట్రేలియా) : మూడు మ్యాచ్‌ల సిరీసలో భాగంగా గురువారం ఆస్ట్రేలియా-ఎ జట్టుతో జరిగిన మొదటి టీ20లో భారత్-ఎ 13 పరుగులతో పరాజయం చవిచూసింది. మూడు టీ20లు, మూడు వన్డేలతోపాటు ఒక అనధికార టెస్ట్ సిరీసలో తలపడేందుకు ఆస్ట్రేలియాలో మన మహిళలు పర్యటిస్తున్నారు. గురువారం జరిగిన తొలి టీ20లో మొదట ఆస్ట్రేలియా-ఎ 20 ఓవర్లలో 137/6 స్కోరు చేసింది. అనికా (50 నాటౌట్), అలీసా హీలీ (27) రాణించారు. లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్ (3/15) మూడు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్-ఎ 20 ఓవర్లలో 124/5 స్కోరుకే పరిమితమై ఓడింది. రాఘవీ బిస్త్ (33), ఉమా ఛెత్రి (31), కెప్టెన్ రాధా యాదవ్ (26 నాటౌట్) పోరాడారు. అమీ, సియాన చెరో రెండు వికెట్లు సాధించారు.

## పంత్‌కు సారీ చెప్పా క్రిస్ వోక్స్

లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీసలో తమ గాయాలను పక్కనబెట్టి రిషభ్ పంత్, క్రిస్ వోక్స్ బరిలోకి దిగి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే పంత్ గాయానికి కారణమైన తాను అతనికి సారీ చెప్పినట్టు వోక్స్ వెల్లడించాడు. నాలుగో టెస్టులో అతడి బౌలింగ్‌లోనే పంత్ రివర్స్ స్వీప్‌నకు యత్నించగా కాలిపాదం ఫ్రాక్చర్ అయ్యింది. అయినా పంత్ రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగాడు. ఇక వోక్స్ కూడా ఐదో టెస్టు ఆఖరి రోజు బ్యాటింగ్‌కు దిగిన విషయం తెలిసిందే. 'నేను భుజం నొప్పితో బ్యాటింగ్‌కు దిగడాన్ని కెప్టెన్ గిల్ అభినందించాడు. ఇక ఇన్‌స్టాలో నా ఫొటోకు పంత్ సెల్యూట్ ఎమోజీ పెట్టాడు. దానికి నేను థ్యాంక్యూ చెప్పి.. నీ పాదం బాగానే ఉందని ఆశిస్తున్నా అని మెసేజ్ పంపా. అటు పంత్ కూడా తన వాయిస్ మెసేజ్‌లో అంతా మంచి




జరగాలని కోరుకుంటున్నానని, మనం ఏదో రోజు కలుద్దామని అన్నాడు. నేను కూడా పాదం గాయం విషయంలో సారీ చెప్పా' అని వోక్స్ వివరించాడు.

## కుప్పకూలిన జింబాబ్వే



బులవాయో : జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌటైంది. బ్రెండన్ టేలర్ (44) రాణించాడు.. హెన్రీ ఐదు, జకారీ ఫోక్స్ నాలుగు వికెట్లతో చెలరేగారు. అనంతరం కివీస్ తొలిరోజు ఆటచివరికి 174/1 స్కోరుతో తిరుగులేని స్థితిలో నిలిచింది. 49 పరుగుల ఆధిక్యంలో ఉన్న న్యూజిలాండ్‌కు ఇంకా 9 వికెట్లు చేతిలో ఉన్నాయి.టేలర్ రికార్డు: జింబాబ్వే బ్యాటర్ బ్రెండన్ టేలర్ అరుదైన రికార్డును అందుకున్నాడు. 21వ శతాబ్దంలో టెస్ట్‌ల్లో అరంగేట్రం చేసి ఎక్కువ సంవత్సరాలు (21 సంవత్సరాల 93 రోజులు) కెరీర్ కొనసాగించిన క్రికెటర్‌గా ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్ (21 సంవత్సరాల 51 రోజులు)ను అధిగమించాడు. 39 ఏళ్ల టేలర్ 2004లో శ్రీలంకపై సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు.

## రాజస్థాన్‌ను వీడనున్న శాంసన్

న్యూఢిల్లీ: మేనేజ్‌మెంట్‌తో తీవ్ర విభేదాల నేపథ్యంలో కెప్టెన్ సంజూ శాంసన్.. రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడడానికి సిద్ధమయ్యాడని సమాచారం. తనను ట్రేడ్ లేదా వేలంలోపాల్గొనేందుకు రిలీజ్ చేయమని ఫ్రాంచైజీని సంజూ కోరాడట. అతడు రాజస్థాన్ జట్టులో కొనసాగడానికి ఇష్టపడడం లేదని శాంసన్ కుటుంబ సభ్యులు కూడా బహిరంగంగానే చెబుతున్నారు. 2025 మెగా వేలానికి ముందు శాంసన్‌ను రాజస్థాన్ రూ. 18 కోట్లకు రిటైన్ చేసుకొంది. 2021 నుంచి ఐపీఎల్‌లో రాయల్స్ తరఫున సంజూ 149 మ్యాచ్‌లు




ఆడాడు. కాగా, ట్రేడింగ్‌లో శాంసన్‌ను తీసుకోవడానికి చెన్నై సూపర్ కింగ్స్ ప్రయత్నాలు చేస్తున్నదన్న వార్తలు వస్తున్నాయి.

# బిజినెస్



## ఎల్ఐసి ఫలితాలు ఆకర్షణీయం




ముంబయి : దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 4 శాతం వృద్ధితో రూ. 10,957 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ. 10,544 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ. 1,14,230.23 కోట్ల నికర ప్రీమియం ఆదాయం చోటు చేసుకోగా.. గడిచిన క్యూ1లో 4.7 శాతం పెరిగి రూ. 1,19,618.41 కోట్లకు చేరింది. కొత్త వ్యాపారం 20.75 శాతం పెరిగి రూ. 1,944 కోట్లుగా నవెూదయ్యింది. "ఏడాదికేడాదితో పోల్చితే నూతన వ్యాపారం భారీగా పెరిగింది. మరోవైపు వ్యయ నిష్పత్తి 10.47 శాతం తగ్గింది." అని ఎల్ఐసి సిఇఒ, ఎండి ఆర్ దొరైస్వామి తెలిపారు. 2025 జూన్ ముగింపు నాటికి ఎల్ఐసి ఆస్తుల నిర్వహణ విలువ (ఏయుఎం) 6.47 శాతం పెరిగి రూ. 57.05 లక్షల కోట్లకు చేరింది. భారత స్థూల బీమా వ్యాపారంలో 63.51 శాతం మార్కెట్ వాటాతో ఈ రంగంలో ఆధిక్యతను కలిగి ఉన్నట్లు ఎల్ఐసి వెల్లడించింది. గడిచిన జూన్ త్రైమాసికంలో కొత్తగా వ్యక్తిగత సెగ్మెంట్‌లో 30,39,709 పాలసీలను విక్రయించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని 35,65,519 పాలసీలతో పోల్చితే 14.75 శాతం పెరుగుదల నమోదయ్యిందని ఎల్ఐసి తెలిపింది.

## ఆల్‌టైం గరిష్ఠానికి పసిడి ధరలు.. ఎంతకు చేరుకున్నాయంటే..




బిజినెస్ డెస్క్: దేశంలో పసిడి ధరలు ఆల్ టైం గరిష్టానికి చేరుకుని మరోసారి షాక్ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 8, 2025 ఉదయం 6:10 గంటల సమయానికి బంగారం ధరలు సరికొత్త స్థాయికి చేరాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,02,560కి చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 94,010కి చేరుకుంది. %ఇదే సమయంలో వెండి ధరలు కూడా పెరిగాయి . కిలో వెండి ధర రూ. 1,17,100 స్థాయిలో ఉంది. ఈ ధరల పెరుగుదల దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కొనసాగుతోంది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, మార్కెట్ డిమాండ్ ఆధారంగా ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.

## స్టాక్ మార్కెట్ అప్‌డేట్..సెన్సెక్స్ 560 పాయింట్ల పతనం, నిఫ్టీ కూడా డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్లో నిన్న భారీ లాభాలను చూసిన ఇన్వెస్టర్లు ఈరోజు (ఆగస్టు 8, 2025) భారీ నష్టాలను చవి చూస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్‌తో ట్రేడ్ చర్చలు జరపనని, టారిఫ్‌ల విషయంలో వివాదం పరిష్కారం అయ్యే వరకు వాణిజ్య ఒప్పందాలు ఉండవని చెప్పడంతో మార్కెట్‌లో నిరాశ మొదలైంది. %ట్రంప్ భారత ఎగుమతులపై 50% టారిఫ్‌లు విధించారు, ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలో ఉదయం 11 గంటల సమయంలో సెన్సెక్స్ 560 పాయింట్లు నష్టపోయి 80,063 పాయింట్లకు చేరింది. మరోవైపు నిఫ్టీ 50 కూడా 186.6 పాయింట్లు తగ్గిపోయి 24,409.55 పరిధిలో ఉంది. దీంతో మదుపర్లు కొన్ని నిమిషాల వ్యవధిలోనే లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు. ఇదే సమయంలో సెన్సెక్స్‌లో భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ వంటి స్టాక్స్ టాప్ నష్టాల కంపెనీల్లో ఉండగా, టైటాన్, , బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా వంటి కంపెనీలు కాస్త పాజిటివ్‌గా ట్రేడ్ అవుతున్నాయి. సెక్టార్ల విషయానికొస్తే నిఫ్టీ రియల్టీ, మెటల్ సెక్టార్లు 1% కంటే ఎక్కువగా పడిపోయాయి. ఆటో, బ్యాంక్, ఎనర్జీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ వంటి సెక్టార్లు కూడా నష్టాల్లో ఉన్నాయి. కానీ, నిఫ్టీ ఆయిల్ గ్యాస్, మీడియా సెక్టార్లు మాత్రం కొంచెం గ్రీన్‌లో ట్రేడ్ అవుతున్నాయి.

## కొత్త వ్యాపారాలే చోదక శక్తులు



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వ్యాపార స్వరూపం మారిపోతోంది. ఇప్పటి వరకు పెట్రో కెమికల్స్, చమురు, గ్యాస్ ఉత్పత్తి, వాటి రిఫైనింగ్.. కంపెనీ వ్యాపారాలకు ప్రధాన ఆధారం. ముందు ముందు రిటైల్, డిజిటల్ సేవలు, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, కొత్త తరహా ఇంధన వ్యాపారాలు కంపెనీ అభివృద్ధికి ప్రధాన చోదక శక్తులు కానున్నాయి. తాజా వార్షిక నివేదికలో వాటాదారులను ఉద్దేశించిన రాసిన ముందు మాటలో ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. ఇదే సమయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్ఐఎల్ డీప్ టెక్ కంపెనీగా రూపాంతరం చెందుతుందన్నారు. ఇందుకోసం దాదాపు వెయ్యి మందికి పైగా శాస్త్రవేత్తలు కృత్రిమ మేధ (ఏఐ), పునరుత్పాదక ఇంధన వనరులు, అధునాతన లోహాల అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ కోసం పని చేస్తున్నట్టు వెల్లడించారు. వీరు అభివృద్ధి చేసిన ప్రతి టెక్నాలజీని ఆర్ఐఎల్‌కు చెందిన ప్రతి వ్యాపార విభాగంలో భాగం చేస్తామన్నారు. అంతర్జాతీయ టెలికాం రంగంలో ప్రధాన శక్తిగా ఎదిగేందుకు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఆరో తరం (6జీ) టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు అంబానీ కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడించారు.. తమ చర్యలన్నీ భారత్‌ను తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. కొత్త వ్యాపారాలతో పాటు పాత వ్యాపారాలైన పెట్రో కెమికల్స్, రిఫైనింగ్ రంగాలపైనా తమ దృష్టి కొనసాగుతుందని అంబానీ తెలిపారు.

## ట్రంప్ సుంకాలతో ఆగమాగం




న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల పోటుతో దేశీయ పరిశ్రమ గగ్గోలు పెడుతోంది. ఈ దెబ్బతో భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే రొయ్య లు, దుస్తులు, ఆర్గానిక్ కెమికల్స్, మెషినరీ, మెకానికల్ అప్లయెన్సెస్, రత్నాభరణాల ఎగుమతులు 50 నుంచి 70 శాతం తగ్గిపోయే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) అనే మేధో సంస్థ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. చైనా, వియత్నాం, బ్రెజిల్ దేశాలతో పోల్చితే భారత్ మాత్రమే అధికంగా నష్టపోనుందని పేర్కొంది. రొయ్యలు, ఆర్గానిక్ కెమికల్స్, కార్పెట్స్, అల్లిన వస్త్రాలు (నిట్టెడ్ అండ్ వోవెన్ అపారెల్స్), వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఫర్నీచర్ వంటి ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు 50-70 శాతం వరకు తగ్గిపోయే అవకాశం ఉందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ తెలిపారు. కాగా స్టీల్, అల్యూమినియం, కాపర్, ఆటో విడి భాగాల ఎగుమతులు 30 నుంచి 50 శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఫార్మా, స్మార్ట్‌ఫోన్స్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై సుంకాల ప్రభావం చాలా తక్కువ ఉండనుందని శ్రీవాత్సవ పేర్కొన్నారు. వస్త్ర పరిశ్రమ మాత్రం ట్రంప్ తాజా సుంకాలను జీర్ణించుకోలేక పోతోంది. మన వస్త్ర ఎగుమతులపై ట్రంప్ సుంకాలను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచేశారు. ఇది ఎగుమతులపై ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన ఎంఎస్ఎంఈ సంస్థలకు చావు దెబ్బ అని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఏపీఈసీ చైర్మన్ సుధీర్ సెఖ్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆర్థికంగా పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. మన దుస్తుల ఎగుమతిలో అమెరికాకు 33 శాతం వాటా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## రూ 150 కోట్లతో పిట్టీ ఇంజనీరింగ్ విస్తరణ




వృద్ధి అవకాశాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుతున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. రూ. 150 కోట్ల పెట్టుబడితో పిట్టీ ఇంజనీరింగ్ ప్లాంట్ విస్తరణతో పాటు అనుబంధ సంస్థలైన పిట్టీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి కార్యకలాపాలు విస్తరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులతో ప్రస్తుతం 90,000 ఎంటీలుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,08,000 ఎంటీలకు పెంచటంతో పాటు ఫౌండ్రీ సామర్థ్యాలను 18,600 ఎంటీల నుంచి 24,000 ఎంటీలకు విస్తరించనున్నట్లు తెలిపింది. దశలవారీగా 18 నెలల్లో ఈ విస్తరణ కార్యకలాపాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ. 463.96 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ. 22.88 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

## 2025: సెప్టెంబరులో అల్యూమెక్స్ ఇండియా



ఢిల్లీ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. 'అల్యూమెక్స్ ఇండియా- 2025' పేరుతో సెప్టెంబరు 10-13 తేదీల మధ్య ఈ సదస్సు జరుగుతుందని అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అలెమై) జాతీయ అధ్యక్షుడు జితేంద్ర చోప్రా చెప్పారు. ఈ సదస్సు లో 250కిపైగా దేశ, విదేశీ కంపెనీలు తమ స్టాల్స్ ఏర్పాటు చేస్తాయన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశీయ అల్యూమినియం పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉన్న అవకాశాలపై చర్చించనున్నట్టు చోప్రా తెలిపారు. దేశ అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ఉత్పత్తుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006